క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ

పీలేరు : మండల కోఆప్షన్ సభ్యుడు రెడ్డిబాషా అనారోగ్యంతో సోమవారం మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం రెడ్డిబాషా స్వగృహానికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే తోపాటు రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, జీనత్ షఫీ, హుమయూన్, హబీబ్‌బాషా, మస్తాన్, జిలాని, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా రామాంజనేయరెడ్డి



కురబలకోట : కురబలకోట చేనేతనగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా టి. రామాంజనేయ రెడ్డి నియమితులయ్యారు. నూతన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉత్తమ బోధన, అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. టీచింగ్, నాన్ టీచింగ్ సహకారంతో గురుకుల పాఠశాలను మెరుగ్గా నిర్వహిస్తానన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పీలేరు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బండ్లవంక, బోడుమల్లువారిపల్లె పరిసరాల్లో ఇటుకలు తయారు చేసే ప్రాంతాల్లో గర్భిణులు, కిషోర్ బాలికలకు ఆరోగ్య పరీక్షలు, ఆరోగ్య సూచన సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల వ్యక్తులు, కుటుంబం అటు సమాజానికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఆడబిడ్డ తమ బాల్య దశను, బాల్య హక్కులను, చదువును కోల్పోతారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, ఆరోగ్య సిబ్బంది కుసుమ, రేణుక, భార్గవి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

పీలేరు రూరల్ : మండలంలోని రేగళ్లలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ సాదిక్‌బాషా, జేడీవో లక్ష్మయ్య ఆధ్వర్యంలో జి. జ్ఞానేంద్ర, వినాయక్‌కుమార్, మోహన్, శంకరయ్య సహకారంతో నిర్వహించిన పశువైద్య శిబిరంలో మెలోనిక్స్, ఎంర్రోఫ్లాక్సిన్, పెండిస్టంట్ ట్యూబ్స్, ట్రెబెవటే, యూరోఇన్, విటమిన్ ఎ, డి, ఏ3, మినరల్ మిక్సర్, డీ5, సెలైన్ మందులు ఉచితంగా అందజేశారు. సుమారు 200 పశువులకు ఉచిత సేవలు అందించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షులు వి. చంద్రారెడ్డి, కార్యదర్శి ఎర్రమరాజు, కృష్ణయ్య, నరసింహారెడ్డి, ఆంజనేయులు, సీతారామరాజు, రామచంద్రయ్య, జనార్దన్, నారాయణరెడ్డి, వెంకటరమణ, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోప్‌స్కిప్పింగ్‌లో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె సిటీ : గుంటూరులో జరిగిన సౌత్ జోన్ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థుల విభాగంలో అఖిల్‌నాయుడు మూడు బంగారు పతకాలు, జస్వంత్ రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకం, ప్రేమ్ రెండు బంగారు పతకాలు, యశ్వంత్ బంగారు,వెండి పతకం, తరుణ్ బంగారు, క్యాంస పతకం సాధించారు. విద్యార్థిని విభాగంలో దివ్యభారతి, ఉష,మేఘనలు రెండు బంగారు పతకాలు సాధించారు. వీరిని పాఠశాలలో మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు దేవకమ్మ, సుధాకర్, అన్సర్, రోప్‌స్కిప్పింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శిరీష, కార్యదర్శి శరత్ కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి

పీలేరు రూరల్ : మండలంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎస్. మహబూబ్‌బాషా అన్నారు. మంగళవారం పట్టణంలోని గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 5914 ఇళ్లకు గానూ ఇప్పటి వరకు 2246 రిజిస్ట్రేషన్లు నమోదు అయినట్లు తెలిపారు. మిగిలినవి త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చాణక్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో దారిసమస్య పరిష్కారం

కేవీపల్లి : మండలంలోని వడ్లకుంట పంచాయతీ శిబ్యాలవారిపల్లెలో పొలాలకు దీర్ఘకాలకంగా ఉన్న దారి సమస్య ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో పరిష్కారమైంది. శిబ్యాలవారిపల్లెలో సుమారు 1200 ఎకరాల వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి గత పదిహేను సంవత్సరాలుగా దారి లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే వారు. దీంతో వైఎస్సార్‌సీపీ మండ కన్వీనర్ వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు బాబురెడ్డి, రాజరెడ్డి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో సర్వే నిర్వహించి సమస్య పరిష్కరించారు. పొలాలకు వెళ్లడానికి వీలుగా రూ. 2 లక్షలతో మట్టిరోడ్డు ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా మదనపల్లె

- అనిబిసెంట్ యూనివర్సిటీ కల సాకారం
- అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాలు
- ఎంపీ మిథున్‌రెడ్డి కృషి మరువలేనిది



అనిబిసెంట్ యూనివర్శిటీకి సంబంధించిన జీఓ ప్రతులను చూపుతున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు.

మదనపల్లె : మదనపల్లె చరిత్రలో నూతన అధ్యాయం ఆవిష్కృతమైంది. పట్టణ ప్రజలు, విద్యావంతులు, మేధావులు, బీటీ కళాశాల పూర్వవిద్యార్థులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అనిబిసెంట్ యూనివర్సిటీ కల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో, ఎంపీ మిథున్ రెడ్డి చొరవతో సాకారమైందని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బిసెంట్ థియోసఫికల్ ప్రభుత్వ కళాశాలను, అనిబిసెంట్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్రప్రభుత్వం జీఓనెం.9 విడుదల చేసిన నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ.. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ....వందేళ్ల ఘనచరిత్ర కలిగిన బీటీ కళాశాల గత వైభవాన్ని కోల్పోయి, మూతపడేదశలో పూర్వవిద్యార్థులు, ప్రజాసంఘాలు, పట్టణప్రజలు..కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆకాంక్షను తెలిపిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టణ ప్రజల కల నెరవేర్చేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని, చెన్నైలోని బిసెంట్ సెంచునరీ ట్రస్ట్ సభ్యులతో మాట్లాడి, కళాశాలను ప్రభుత్వ స్వాధీనం చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ప్రభుత్వంలోకి విలీనం జరిగిన ఎనిమిది నెలల కాలంలోనే, పట్టణం మరింతగా అభివృద్ధి చెందాలంటే, బీటీ కళాశాలను యూనివర్సిటీగా చేస్తే బాగుంటుందని భావించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కల సాకారమయ్యేలా చేశారన్నారు. రాయలసీమలో చారిత్రక నేపథ్యం కలిగిన, ప్రతిష్టాత్మక బీటీ కళాశాలను అనిబిసెంట్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తే...ప్రతిపక్షాలు రాజకీయం చేయడం, ఎల్లోమీడియాలో చవకబారు విమర్శలు గుప్పించడం సరికాదన్నారు. అనిబిసెంట్ యూనివర్సిటీ విషయంలో ఎంపీ మిథున్‌రెడ్డి కృషి మరువలేనిదన్నారు. అన్నమయ్య జిల్లాలో మొదటి యూనివర్సిటీగా మదనపల్లెలో అనిబిసెంట్ యూనివర్సిటీతో పాటుగా, రూ.500 కోట్లతో మెడికల్ కాలేజ్, కేంద్రీయ విద్యాలయం తదితర ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి ఇది అని తాము చెప్పగలుగుతున్నామన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి ఏదైనా ఉంటే మీరు చెప్పగలరా అని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తర్వాత ఐదేళ్ల టీడీపీ పాలనలో మదనపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకపోగా, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎంపీ మిథున్‌రెడ్డి అభివృద్ధి చేస్తుంటే.. ఆయన చిత్తశుద్ధిని శంకించడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అనిబిసెంట్ యూనివర్సిటీ విషయంలో ప్రతిపక్షాలు చేసిన అబద్ధపు ఆరోపణలకు నిస్సిగ్గుగా క్షమాపణ చెప్పాలన్నారు. బీటీ కళాశాల పట్టణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకని, దానిని అనిబిసెంట్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసినందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి పట్టణ ప్రజలు ఎంతో రుణపడి ఉంటామన్నారు. పేద విద్యార్థులకు ఉన్నతవిద్య చేరువవడమే కాకుండా, పట్టణం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌అజం, నాయకులు సిలార్‌ఖాన్, వెలుగుచంద్ర, కౌన్సిలర్లు ప్రసాద్‌బాబు, డిష్‌రామకృష్ణారెడ్డి, ఎస్వీ.రమణ, ఈశ్వర్‌నాయక్, కరీముల్లా, రేణుక, రామిశెట్టిశివయ్య, ఆంజనేయులు, కత్తిరాజు, సలీం, కత్తిమంజు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు



అగ్రహారంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి

నిమ్మనపల్లె : అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ లోకేష్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో పర్యటించి స్థానికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించారు. సారాతయారీ, అమ్మకాలు, పేకాట కోడిపందాల నిర్వహణ, తదితర నేరాలకు పాల్పడితే కేసులు తప్పవన్నారు. లైసెన్స్ లేని నాటు తుపాకులు కలిగి ఉండడం చట్టరీత్యా నేరమని స్వచ్ఛందంగా అప్పగించాలని సూచించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని చెప్పారు.

తలనీలాల సేకరణ వేలం మళ్లీ వాయిదా

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసినశ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో తలనీలాల సేకరణ వేలం రెండవసారి కూడా వాయిదా పడినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ మంజుల తెలిపారు. మంగళవారం ఆలయ కార్యాలయంలో కర్నూలు దేవదాయశాఖఅధికారి రవికిరణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు తలనీలాల సేకరణకు వేలం పాట నిర్వహించారు. వేలంలో మొత్తం ఐదుగురు పాటదారులు పాల్గొన్నారు. గత ఏడాది రూ.27,10000కు వేలం దక్కించుకున్నారు. ఈసారి కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో దేవదాయశాఖ అధికారులు రూ.15 లక్షల నుంచి వేలం ప్రారంభించారు. రూ.15,50.000 వరకు వేలం పాడారు. దేవాదాయశాఖ నిబంధనలు అందుకు అంగీకరించక పోవడంతో వేలం పాటను మళ్లీ ఈనెల 23న నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు.

పంచాయతీల అభివృద్ధిపై డీపీఓ సమీక్ష



దంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మీ

రామసముద్రం : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో పంచాయతీల అభివృద్ధిపై జిల్లా పంచాయతీ అధికారి ఎం.ధనలక్ష్మీ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీకి మంజూరైన నిధులు, వీధి దీపాలు, విద్యుత్ బిల్లులు, క్లాప్ మిత్ర జీతాలు తదితర పనులకు ఖర్చు చేయవలసిందిగా తెలిపారు. అలాగే మార్చి నెలాఖరుకు మరో విడత నిధులు రిలీజ్ అవుతాయని చెప్పారు. సర్పంచ్‌ల ద్వారా అన్ని వాటికి ఖర్చు చేయాలని సూచించారు. అలాగే ఇంటి పన్నులు ఈనెలాఖరుకు 90 శాతం వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం అన్ని అంశాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే రామసముద్రంలోని డంపింగ్ యార్డును పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. అలాగే రామసముద్రం సచివాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

జిల్లా ప్రజారవాణాధికారి రాము

మదనపల్లె సిటీ : డ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని జిల్లా ప్రజారవాణాధికారి రాము అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక డిపోలో రక్తదాన శిబిరం, జ్ఞానోదయ పాఠశాలలో అవగాహన కర్యాక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల వాహనాలను సక్రమంగా నడపడం జరుగుతుందన్నారు. జ్ఞానోదయ పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక డిపో కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. కార్యక్రమంలో డిఎం మూరే వెంకటరమణారెడ్డి, సీఐలు రేవతి, గీత, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బస్టాండును పరిశీలించారు. మినరల్ వాటర్ పాయింట్, స్టాల్స్, క్యాంటీన్, పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశీలించారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీనివాసుడు

తంబళ్లపల్లె : కోసువారిపల్లెలోని శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఐదు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు కనువిందుగా సాగుతున్నాయి. మంగళవారం ఉప ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్ బాబులు శ్రీదేవి,భూదేవి సమేత స్వామివారిని కల్పవృక్ష వాహనంపై ప్రత్యేక అలంకరణ చేశారు. శాస్త్రోత్తంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి హనుమంత వాహనంపై పురవీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

ములకలచెరువు : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసే రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి మంగళవారం తెలిపారు. పోలీసుల కథల మేరకు వివరాలు ఇలా.. ములకలచెరువు మండలం కాలువపల్లి పంచాయతీ, ఎస్సీ కాలనీ చెందిన రెడ్డెప్ప కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. రెడ్డెప్ప ను అదుపులోకి తీసుకొని 25 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అందరికి ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

పెద్దమండ్యం : గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద ప్రజలందరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ సి. వెంకటరమణయ్య అన్నారు. మండలంలోని పాపేపల్లె పంచాయతీలోని యల్లంవారిపల్లె ఉన్నత పాఠశాలలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపునకు వచ్చే ప్రజలు, రోగుల కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం రెండవ విడతగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. శిబిరానికి వచ్చిన రోగులకు నలుగురు డాక్టర్‌ల బృందం చికిత్స చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌వో క్రిష్ణయ్య, డాక్టర్‌లు ఇమ్మాన్యుల్, హరివర్మ, గ్రామ సర్పంచ్ పీరాన్‌బి, ఎంపీటీసీ బోడిమాని గీత, పంచాయతీ కార్యదర్శి జనార్దన్, గ్రామ సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కీం బోర్ నీరు పంట పొలాలకా?

- 10 రోజులుగా గ్రామానికి అందని తాగునీరు
- తాగునీటి సమస్యపై ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న మాజీ సర్పంచ్‌లు గుర్రప్ప తదితరులు

కలకడ : గ్రామస్తుల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం రూ. లక్షలు ఖర్చుచేసి బోరు వేసి, పైపులు, కుళాయిలు ఏర్పాటు చేసి ఇంటింటికి నీటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కొందరు స్వార్థ పరులు తాగునీటి కథ దేవుడెరగు పంటకు నీరు ఉంటే చాలని యథేచ్ఛగా స్కీం బోరు నీటిని పంట పొలాలకు అక్రమంగా వినియోగించుకుంటున్న సంఘటన కలకడ మండలం, కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం జగనన్న కాలనీలో చోటు చేసుకుంది. గ్రామంలో, జగనన్న కాలనీలో గత 10 రోజులుగా తాగునీరు లేకపోవడంతో బిందె నీటి కోసం గ్రామస్తులు పడిన పాట్లు వర్ణనాతీతం. తాగు నీటి సమస్యపై మంగళవారం ఫోటోలు, ఆధారాలను చూపుతూ ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డికి ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ గుర్రప్ప, డాక్టర్ జనార్దన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం, తదితరులు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పెద్దమండ్యం : రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఎస్ఓ

పెద్దమండ్యం : జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల్లో మండలంలోని కెజిబీవీ నుంచి ఓ విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఓ పి రాణికుమారి తెలిపారు. రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైన 9వ తరగతి విద్యార్థిని టి నాగేశ్వరిని మంగళవారం పాఠశాలలో ఎస్‌వో, ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లా స్థాయిలో 30 మండలాల నుండి వచ్చిన విద్యార్థులు 245 ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు ఎస్ఓ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు 21 ప్రాజెక్టులను ఉన్నతాధికారులు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో కెజిబీవీ విద్యార్థిని 'స్టూడెంట్స్ అటెండెన్స్ నోటిఫికేషన్ టు పేరెంట్స్' ప్రదర్శించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

ఉర్దూ హైస్కూల్ విద్యార్థిని ఎంపిక

పెద్దతిప్పసముద్రం : జిల్లా స్థాయిలో జరిగిన ఇన్‌స్పైర్ మనక్-2024 ఎగ్జిబిషన్ ప్రాజెక్ట్ పోటీల్లో పెద్దతిప్పసముద్రం ఉర్దూ హైస్కూల్‌కు చెందిన షఫియా రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైంది. విద్యార్థిని రూపొందించిన సోలార్ గ్రాస్ కట్టర్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం భాగ్యమ్మ మంగళవారం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆరవ తరగతి చదివే సదరు విద్యార్థినితో పాటు భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు ఎస్‌కే మున్వర్‌బేగంను ఎంఈఓ నారాయణ, ఎంఈఓ-2 గౌస్‌పీర్‌తో పాటు స్కూల్ కమిటీ చైర్మన్ అభినందించారు.

తెట్టు ఇన్‌స్పైర్ ప్రాజెక్టు ఎంపిక

కురబలకోట : రాయచోటి డైట్ కళాశాలలో అన్నమయ్య జిల్లా స్థాయిలో జరిగిన ఇన్‌స్పైర్ పోటీలలో మండలంలోని తెట్టు జడ్పీ హైస్కూల్ ఎనిమిదవ తరగతి విద్యార్థి ఆవుల భరత్ కుమార్ ప్రదర్శించిన క్రాప్ ప్రొటెక్టర్ ఫ్రమ్ బర్డ్స్ అండ్ అనిమల్స్‌ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ ద్వారకనాథ్ తెలిపారు.

యర్రయ్యగారిపల్లె పాఠశాల విద్యార్థిని..

కలకడ : రాష్ట్ర స్థాయి పోటీలకు కలకడ మండలం, బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని రుక్సాన ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని రుక్సాన ఇన్‌స్పైర్ మనక్ ప్రాజక్ట్‌ల ప్రదర్శనలో భాగంగా జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయంలో వినియోగించే విత్తనాలు భూమిలో వేసే ప్రాజెక్ట్‌ను ప్రదర్శించింది. ఈప్రాజెక్టును రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికచేసినట్లు తెలిపారు.

గ్రామీణ విద్యార్థులు ఎంపిక

తంబళ్లపల్లె : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ కు ఎంపికయ్యారు. రాయచోటి లో సోమవారం జరిగిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో కన్నెమడుగు ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థినీ కార్తిక 'ప్రొటెక్షన్ ఆఫ్ నర్సరీ' నర్సరీలో మొక్కలను ఎండ, వాహన నుండి సంరక్షించే పద్ధతిపై గైడ్ టీచర్ శాస్త్రి సహకారంతో ప్రదర్శించారు. 10వ తరగతి విద్యార్థి ఎ.సుమంత్ 'సూర్యరశ్మి కేంద్రీకృతం చేసి చల్లటినీటిని వేడిచేసే ప్రక్రియ' ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఆ విద్యార్థులను డిప్యూటీ ఈవో శ్రీరామ్‌పురుషోత్తం, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు ప్రశంసపత్రాలు అందజేశారు.

నైపుణ్య శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ

మదనపల్లె : ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మదనపల్లె జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓబులేషు మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ,యువకులకు ఇస్తున్న ఉచిత నైపుణ్యశిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకుని, ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. ప్రస్తుతం మొదటిబ్యాచ్ శిక్షణ పూర్తి అయిన నేపథ్యంలో కొత్త బ్యాచ్ ప్రారంభమవుతోందన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. వివరాలకు 9553202509 నెంబర్‌పై సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు , స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ గజ్జెలవాండ్లపల్లిలో బుధవారం గంగా భవానీ దేవి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంగళవారం పలు పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో చేపట్టారు. విగ్రహ ప్రతిష్టకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి

కేవీపల్లె : సమష్టి కృషితో మండలాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ ఈశ్వరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఎంపీడీవో రెడ్డెయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజారోగ్యం, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం శాఖల వారిగా అధికారులు మండలంలో జరిగిన ప్రగతి చదివి వినిపించారు. వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.